సాక్షి పెద్దపల్లి

గురువారం । 12 । జనవరి । 2023



మల్లన్నను దర్శించుకున్న భక్తులు

ఓదెల: ఓదెల మల్లన్న స్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. కోడెమొక్కులు చెల్లించుకుని ఒగ్గు పూజారులతో పట్నాలు వేశారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు.



పత్తి క్వింటాల్‌కు రూ.8,111

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి క్వింటాల్‌కు రూ.8,111 పలికింది. కనిష్టంగా రూ.7,000, సగటు రూ.8,061గా నిర్ణయించినట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
29.0 /13.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది.
ఉదయం పొగమంచు కురుస్తుంది.
చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

పొగమంచుతో సూపర్ ఫాస్ట్ రైళ్లు ఆలస్యం



తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు

రామగుండం: ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండడం.. పొగమంచు కప్పేస్తుండడంతో ఢిల్లీ కేంద్రంగా బయల్దేరే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ గంటల తరబడి ఆలస్యంగా వస్తున్నాయి. రైలు ఏ సమయానికి వస్తుందో రైల్వే ఎంక్వయిరీలోనూ కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. బుధవారం న్యూఢిల్లీ నుంచి త్రివేండ్రం వైపు వెళ్లే కేరళ ఎక్స్‌ప్రెస్ పది గంటలు, న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఏడు గంటలు, న్యూఢిల్లీ నుంచి విశాఖపట్టణం వెళ్లే ఏపీ ఏపీ ఎక్స్‌ప్రెస్ 13 గంటలు, దాణాపూర్ నుంచి బెంగళూరు వెళ్లే సంఘమిత్ర ఏడు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఆయా రైల్వేస్టేషన్లకు నిర్దేశిత సమయానికి చేరాల్సిన రైళ్లన్నీ గంటల తరబడి ఆలస్యంగా వస్తుండడంతో శబరిమల వెళ్లే అయ్యప్ప మాలధారణస్వాములు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

'గుర్తింపు' ఎన్నికలు జరపండి..



వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో 'గుర్తింపు' ఎన్నికలు నిర్వహించాలని బుధవారం ఏఐటీయూసీ నాయకులు డిప్యూటీ సీఎల్‌సీకి వినతిపత్రం అందించారు. పదిరోజుల్లోగా ఎన్నికలు నిర్వహించకుంటే ఆర్‌ఎల్‌సీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నిర్ణీతకాలంలోగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో కోర్టు ఉత్తర్వుల ప్రకారం సకాలంలో నిర్వహించాలని, లేకుంటే కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కింద మళ్లీ కోర్టును ఆశ్రయిస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కలిసి కావాలనే ఎన్నికలను జాప్యం చేస్తున్నాయన్నారు. దీనిపై డిప్యూటీ సీఎల్‌సీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోసు, బాలరాజు, కొరిమి రాజ్‌కుమార్ ఉన్నారు.

బాల కార్మికులతో పనిచేయిస్తే చర్యలు



పిల్లలతో డీసీపీ, పోలీసు సిబ్బంది

సుల్తానాబాద్‌రూరల్: ఇటుకబట్టీల్లో బాల కార్మికులతో పనిచేయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని డీసీపీ రూపేశ్ అన్నారు. ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు విద్యనందించేందుకు సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన వర్క్‌సైట్ స్కూల్‌ను బుధవారం ప్రారంభించారు. ప్రాజెక్ట్ ధృవలో భాగంగా ఇటుకబట్టీల్లో కార్మికుల పిల్లలకు విద్యనందించేందుకు స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి మండలంలో ఇప్పటికే మూడు స్కూళ్లను ప్రారంభించామని, త్వరలో మరో నాలుగు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సుల్తానాబాద్‌లోని ఇటుకబట్టీల్లోనూ ఏర్పాటు చేసి ఒడిశా టీచర్‌ను నియమించామని, సులభంగా అర్థమయ్యేలా టీవీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీపీ సారంగపాణి, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు ఉపేందర్‌రావు, అశోక్‌రెడ్డి, బట్టి యజమానులు లక్ష్మణ్‌రావు, లవన్‌రావు, పురుషోత్తం, శ్రావణ్, సందీప్‌రావు, అవినాష్ తదితరులున్నారు.

యువ 'కలం'..

- రచయితలుగా రాణిస్తున్న మన యువత
- కలంపట్టి గళమెత్తుతున్న కవులు
- యువజన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు



'ఉక్కు నరాలు వజ్ర సంకల్పమున్న యువతను నాకు ఇస్తే.. ఈ దేశాన్ని మారుస్తా' అని స్వామి వివేకానంద సూక్తి. వివేకానందుడి ఆశయాలను కొనసాగిస్తూ సమాజ మార్పునకు ఉక్కునరాలు పిడికిలెత్తాయి. యువ కలాలు సమాజ హితానికి గళమెత్తాయి. మార్పును కోరుతూ రచనలు చేస్తున్నాయి. వాళ్ల కలం నుంచి జాలువారిన.. జాలువారుతున్న ఒక్కో సిరాచుక్క ఎంతో మందిని ప్రభావితం చేస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువత అక్షరాలు, సాహితీ తోటలు వికసిస్తున్నాయి. సుగంధాలు పంచుతున్నాయి. కవిత, పాట, కథ ఇలా ప్రక్రియ ఏదైనా.. పైచేయి తమదే అంటున్న సాహితీ సేద్యకులపై వివేకనందుడి జయంతి సందర్భంగా ప్రత్యేక కథనాలు..

- సాక్షి, కరీంనగర్ డెస్క్

ఈ 'రవీంద్రుడు'.. కవీంద్రుడు



ఓదెల మండల కేంద్రానికి చెందిన బ్రాహ్మండ్లపల్లి రవీంద్రాచారి వృత్తిరీత్యా ఆర్టిస్ట్. ఓ వైపు బొమ్మలేస్తూనే.. మరోవైపు సాహిత్యంలో రాణిస్తున్నారు. కంటితో చూసిన దృశ్యానికి చిత్ర రూపం ఇస్తూ మనసులో మెదిలినభావాలను అక్షరబద్ధం చేస్తున్నారు. 2002 నుంచి కవితలు రాస్తున్నారు. వివిధ సంకలనాల్లో ఆయన రాసిన కవితలు ప్రచురితమయ్యాయి. భగవంతుని స్వరూపం కవిత రాసినందుకు గాను డాక్టర్ సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2015లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఓదెల మండల ఉత్తమ సాహితీ వేత్తగా అవార్డుతోపాటు రూ.10 వేలు చెక్కు అందుకున్నారు. 2020 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై పుట్టిన రోజును పురస్కరించుకుని కరోనాపై కవితల పోటీలో పాల్గొన్నారు. గవర్నర్ చేతుల మీదుగా కన్సోలేషన్ అవార్డ్, రెండు వేల రూపాయల చెక్కు అందుకున్నారు. అంతేకాదు జానపద సినీ గీతాల రచనలోనూ రవీంద్రచారి ప్రతిభ కనబరుస్తున్నారు. సినిమాలకు జానపద సాహిత్యం అందించడమే తన ధ్యేయమని ఆయన చెబుతున్నారు.

భావానికి ఆత్మ.. 'పాళీ'

సిరిసిల్లలో పుట్టిన చిందం మల్లేశం డిగ్రీ వరకు చదివారు. ప్రస్తుతం గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటలో మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారు. కవిత్వంపై మక్కువతో 'పాళీ' అనే కలం పేరుతో కవిత్వాన్ని రాస్తున్నారు. చిన్నతనంలో సిరిసిల్ల నేత కార్మికుల బతుకు వ్యథలను చూసిన ఆయన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని వాళ్ల బతుకుచిత్రంపై ఎన్నో కవితల్ని రాశారు. స్వతహాగా నేసిన అనుభవంతో నేతన్నల జీవన శైలిని తన కవితా వస్తువుగా చేసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో పలు ప్రశంసలు అవార్డులు అందుకున్నారు. 'అక్షరం అమ్మయితే ఆవేదన నాన్న..' వీటి సంతానమే సాహిత్యం అని ఆయన భావన. సమాజాన్ని అద్దంలో చూపించాలంటే కేవలం సాహిత్యంతోనే సాధ్యమని తన అడుగులను సాహిత్యం వైపు వేస్తున్నారు. ఇప్పటివరకు వెయ్యికి పైగా కవితలు రాశారు. కరోనా సమయంలో 'మాస్క్ పెట్టు.. మావా మాస్క్ పెట్టు' రాసిన పాట, ఇటీవల పోలీసులపై రాసిన పాటలు ఆయనకు ఎంతో పేరును తెచ్చిపెట్టాయి.

'మా ఊరి చెరువులో చేపలు బతుకుతాయి..
మనుషులు చస్తారు
ఎముకలపై చలి అత్యాచారం చేస్తుంటే..
చెమటలు చలి చీమలవలె కొరికేస్తుంటే..
మగ్గంపై మొగ్గయింది తెల్లని బట్ట..
అయినా.. మాకది చీమల పుట్ట'

అంటూ వారి చేతికందని బట్ట గురించి ఎంతో లోతుపాతుగా కవిత్వాన్ని రాశారు.



మరో కవితలో...

'ఇక్కడి దేహాలు బొక్కల్ని
దాచుకునే అలమరాలు
శవాల్ని ముద్దాడే గులకరాళ్లు'

అంటూ నేతన్నల ఆత్మహత్యల గురించి తనదైన శైలిలో కలాన్ని విదిలించారు.

పేదరికం గురించి రాస్తూ..

'విశ్వానికి ఒకడే సూరీడు
తడకల ఇంటికి లెక్కపెట్టలేనన్ని సూర్యుళ్లు
నాన్న గొంతులోకి దిగిన కళ్ల చుక్కలు
నా గుండెల్యాబ్‌లో మారిన కన్నీటి చుక్కలు
ఎంత లోతో జీవితం కాలికి గుచ్చిన ముల్లునడుగు..
ఎంత ఎరుపో జీవితం కడుపులో మండుతున్న సూర్యున్నడుగు
ఎంత నలుపో జీవితం చేతికి అంటిన కందెననడుగు..'

అంటూ వచన కవిత్వంతోపాటు మినీ కవిత్వాన్ని కూడా రాశారు.

వృత్తి వ్యాపారం.. ప్రవృత్తి సాహిత్యం



దొమ్మటి శంకర్ ప్రసాద్‌ది కరీంనగర్ జిల్లా కేంద్రం. వృత్తిరీత్యా వ్యాపారి. ఆకట్టుకునే రచనలు చేస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి శ్రీశ్రీ, తిలక్, ఠాగూర్ కవిత్వానికి ఆకర్షితుడై కవిత్వం రాస్తున్నారు. కరీంనగర్ సాహితీ పెద్దలు ఆయనకు మరింత ప్రోత్సాహమిచ్చారు. ప్రస్తుతం తెలంగాణ రచయితల సంఘం కరీంనగర్ శాఖకు ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయన ఇప్పటివరకు అనేక అవార్డులు సన్మానాలు అందుకున్నారు. సాహిత్యంలో పీహెచ్‌డీ చేయాలనేది శంకర్ కల. 'ఫిట్టర్ కొమురయ్య కథలు' పుస్తకాలను ఆయన త్వరలోనే ఆవిష్కరించనున్నారు.

సాహిత్యంలో 'మెరుగు'



మెరుగు ప్రవీణ్‌ది రామడుగు మండలంలోని గోలి రామయ్యపల్లి. కరీంనగర్ జిల్లాలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. తండ్రి లక్ష్మీనారాయణ తబలా వాయిద్యకారుడు కావడంతో ప్రవీణ్‌కు చిన్నప్పటి నుంచి కళలపై ఆసక్తి ఏర్పడింది. కళలపై ఇష్టంతో సాహిత్యంలో రాణిస్తున్నారు. పాటలు రాసి పాడుతూ యూట్యూబ్‌లో రిలీజ్ చేస్తున్నారు. ఎస్సారార్ కళాశాల వలంటీర్ ఆర్గనైజేషన్ స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవా రంగంలో ఇప్పటివరకు అనేక అవార్డులు అందుకున్నారు. సమాజ మార్పును ఆశించే కవిత్వం రాస్తూ ప్రముఖుల మన్ననలు పొందుతున్నారు. 'జీవన ప్రయాణం', 'మేల్కొనండి' పేరిట రెండు కవితా సంపుటాలను ప్రచురించారు.

'సౌమ్య'మైన కవిత్వం



ఈదెపు సౌమ్యది రాజన్న సిరిసిల్ల జిల్లా. సౌమ్య సిరిపూర్‌లో ఆరో తరగతి చదువుతున్నప్పుడు అంధుడైన ఉపాధ్యాయుడు శ్రీధర్ స్వామి సాహిత్యం ఆకట్టుకుంది. తెలుగు టీచర్ జానకి పాఠాలు సాహిత్యం వైపు నడిపించాయి. అప్పట్నుంచి అలవోకగా సౌమ్య కవితలు అల్లుతూ వస్తున్నారు. వందల కొద్ది కవితలు రాశారు. 'సౌమ్య అలలు' పేరుతో కవితల పుస్తకాన్ని తీసుకొచ్చారు. ఈనాటి యువతరాన్ని చైతన్య పరిచేలా కవితలు రాస్తూ ముందుకు సాగుతున్నారు. 'మానేటి ఒడ్డున పుట్టి పెరిగినందున ఆ నదితో ఉన్న అనుబంధమే ఇప్పుడు నన్ను కవయిత్రిని చేసింది' అని ఆమె చెబుతున్నారు.

నిజాన్ని నిర్భయంగా చెప్పే సుగుణ కలం



బెజ్జంకి మండలం గూడెం గ్రామంలో పుట్టిన మాంకాలి సుగుణ పీజీ, బీఎడ్ పూర్తి చేశారు. ప్రస్తుతం బెజ్జంకి మోడల్ స్కూల్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. డిగ్రీ చదువుతున్నప్పటి నుంచి కవిత్వం రాస్తున్నారు. అమ్మ మల్లవ్వ స్ఫూర్తితో, తాను చూసిన పేదకుటుంబాల గురించి... రైతులు.. స్త్రీల గురించి అద్భుతమైన కవిత్వం రాస్తున్నారు. సుగుణ దివ్యాంగురాలైనప్పటికీ తనలాంటి వారి కష్టాలను బాధలను పాటలు, కవితల రూపంలో అక్షరీకరిస్తున్నారు.

'కారు మబ్బులు
కమ్మిన కటిక చీకటి
రేయి పగలు కనిపించని
న్యాయ దేవతలే
అడుగు తీసి అడుగులే వేయలేని నడకలే
విధి వైపరీత్యాలే వెక్కిరింతలై
ఎవ్వరికి ఏమని చెప్పని జీవితాలు
మానవత్వ విలువలకు ప్రతిరూపాలు'

అంటూ.. దివ్యాంగుల బాధలను వారు వైకల్యంతో ప్రతిక్షణం మానసికంగా కుంగిపోతున్న విధానాన్ని పాట రూపంలో రాశారు. ఇలా ఇప్పటివరకు 480 కవితలు 60 పాటలు, పలు కథలు రాసి రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకున్నారు. దివ్యాంగురాలైనప్పటికీ ఆమెకున్న ఆత్మస్థైర్యం నేటి యువతకు ఆదర్శం.

దోపిడీ సమాజాన్ని ప్రశ్నించే 'కర్ణాకర్'



జమ్మికుంటకు చెందిన రామగుండం కర్ణాకర్ పరిశోధక విద్యార్థి. ఇప్పటివరకు 500లకు పైగా కవితలు రాశారు. వ్యవస్థీకృతమైన దోపిడీ సమాజమపు రూపాన్ని నగ్నంగా చూపిస్తూ.. అందులో సమిధలవుతున్న అభాగ్యులకు ఆయన అక్షరాలను అందించేందుకు చిరు ప్రయత్నం చేస్తున్నారు. 'కలం ఖాండ్రించి ఉమ్ముతోంది' అనే పుస్తకాన్ని రాశాడు.

'ఒరేయ్... పచ్చ నోట్ల
అక్షరవన బిచ్చపోళ్లారా...
ఈ కలంలోని సిరా
ఖాండ్రించి ఉమ్ముతోందిరా..
మనసులోని నిజాయితీ
పొరలు పొరలుగా నిగ్గదీసి
అడుగోతోందిరా...
నిస్సిగ్గుగా సిగ్గునొదిలేసినా
సిరాబతుకుల
బజారులో అక్షరాలమ్ముకొంటూ
లక్షల కోట్ల రంగురంగు
తెరలపై రాజభోగమనుభవిస్తోన్న
పచ్చ నోట్లకూ కక్కుర్తిపడ్డ
కలం కుద్బుద్ధులజూసి
ఈ కలం మీ మొహంపై
ఖాండ్రించి ఉమ్ముతోందిరా'

అంటూ కలంతో ఎండగడుతున్నారు.

ప్రజాసేవ మరచి దోచుకుతింటున్నారు

- అవినీతి పాలకుల నుంచి విముక్తి పొందాలి
- తొమ్మిదేళ్లలో ఎమ్మెల్యే దాసరి ఏం చేశారో చెప్పాలి
- 'గడపగడపకూ కాంగ్రెస్'లో మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



ఇంటింటికీ ప్రచారం చేస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసేవను విస్మరించి అవినీతి, స్వార్థపూరిత పాలన సాగిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు విజయరమణారావు ఆరోపించారు. పెద్దపల్లి పట్టణంలో బుధవారం 'గడపగడపకూ కాంగ్రెస్' నినాదంతో చేపట్టిన కార్యక్రమం సుభాష్‌నగర్, ఆదర్శనగర్, వైఎస్సార్‌నగర్‌లో సాగింది. ఈ సందర్భంగా వార్డు మహిళలు విజయరమణారావుకు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లిన ఆయన బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై ముద్రించిన కరపత్రాలను అందించారు. సుభాష్‌నగర్ కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్, మాజీ ఎంపీపీలు సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, మస్రత్ తదితరులు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ఇంధనం, గ్యాస్, నిత్యావసరాల ధరలను పెంచుతోందని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల దోపిడీకి అడ్డు, అదుపులేకుండా పోయిందని పేర్కొన్నారు.

తొమ్మిదేళ్లలో ఏం చేశారో..?!

'దాసరి మనోహర్‌రెడ్డి.. ఎమ్మెల్యేగా నీకు రెండు సార్లు అవకాశం ఇచ్చారు.. నిన్ను ఎన్నుకున్న పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలకు ఏం చేశావో చెప్పు.. తొమ్మిదేళ్లుగా ప్రజలను పట్టించుకోకుండా స్వార్థ రాజకీయాలు చేస్తున్నావ్..' అని విజయరమణారావు అన్నారు. నియోజకవర్గం, జిల్లా కేంద్రంగా ఉన్న పెద్దపల్లి పట్టణ ప్రజలు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని కూడా దాసరి ఇంటికే కట్టబెడితే ప్రజలు, వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసేలా పాలన సాగిస్తున్నారంటూ మండిపడ్డారు. మున్సిపల్ నిధులను తనకు కల్పతరువుగా మారిన ఎల్లమ్మగుండమ్మ చెరుకు మళ్లించుకుని దోచుకుతింటున్నారని ఆరోపించారు. పట్టణ ప్రజలకు కనీస వసతులను కూడా కల్పించకుండా కేవలం తన ఆస్తులు ఉన్న ప్రాంతాలకే అభివృద్ధిని పరిమితం చేసుకున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కే అధికారం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పాలనలోనే మేలు జరుగుతుందని ప్రజలకు వివరించారు. సమావేశంలో కౌన్సిలర్ తూముల సుభాష్‌రావు, సంపత్, నాయకులు సురేశ్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, శ్రీమాన్, చందు, వెంకటేశ్, సర్వర్, విజయేందర్‌రెడ్డి, జగదీశ్, తిరుపతిరావు, జానీ, ఫసీ, సురేశ్, శోభ, రవి, తూముల మహేశ్, నదీం, మెరాజ్, హకీం, అబ్బు, అజ్జల్, కుమార్ తదితరులున్నారు.

కంటి వెలుగులు పంచాలి



మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్, చిత్రంలో కలెక్టర్, ప్రజాప్రతినిధులు

- ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం అవసరం
- 100రోజులు.. 34 బృందాలతో నిర్వహణ
- రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- మలివిడత కంటివెలుగుపై అవగాహన సమావేశం

పెద్దపల్లిరూరల్: 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం..' అనే నానుడిని నిజం చేసేందుకు ప్రజలందరికీ కంటి పరీక్షలు నిర్వహించాలని, దృష్టిలోపం ఉన్నవారికి వెలుగులు పంచాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ సంగీత, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడారు. వృద్ధుల్లో ఎక్కువ మంది కంటి సమస్యతో బాధపడుతున్నారని, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆసుపత్రులకు వెళ్లలేని స్థితిలో ఉన్నవారికి కంటివెలుగు ఎంతో ఉపకరిస్తుందని పేర్కొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటుకు

రాష్ట్రంలో తొలివిడత కంటివెలుగులో 1.50 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించామని మంత్రి ఈశ్వర్ అన్నారు. మలివిడతలో అంతకు రెట్టింపు బృందాలను ఏర్పాటు చేసి 100రోజులపాటు కంటి వెలుగు నిర్వహించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సాధిస్తామనే ధీమా వ్యక్తం చేశారు. ఊళ్లలోకే బృందాలు వెళ్లి కంటిపరీక్షలు నిర్వహిస్తాయన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం..


అంధత్వ నివారణే లక్ష్యంగా కంటివెలుగు రెండో విడత కార్యక్రమం సాగుతుందని కలెక్టర్ అన్నారు. 18 ఏళ్లు పైబడ్డ వారందరికీ కంటిపరీక్షలు జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. శిబిరాల నిర్వహణకు స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కోరారు. సీఎం కేసీఆర్ ఆలోచనలు ప్రజలకు మేలు చేసేలా ఉండడమేగాక దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎంపీ వెంకటేశ్ నేత అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగును అందరూ వినియోగించుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, మేయర్ అనిల్‌కుమార్, పెద్దపల్లి, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్లు మమతారెడ్డి, పుట్ట శైలజ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్, డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

టపాసుల గోదాములో అగ్నిప్రమాదం

- భారీగా ఎగిసిపడిన మంటలు
- మంటలు ఆర్పేందుకు వచ్చిన మూడు ఫైరింజన్లు
- రూ.కోటికిపైగా ఆస్తి నష్టం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



సంఘటన స్థలం వద్ద బాధితులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట శివారులోని ఎస్‌ఆర్‌ఆర్ ఫైర్ వర్క్స్ గోదాం నుంచి మంటలు చెలరేగాయి. ఏమైందో తెలిసేలోపే టపాసులు ఒక్కొక్కటిగా పేలుతుండడం.. ఆ శబ్దానికి తోడు మంటలు ఎగిసిపడుతుండడంతో పెద్దపల్లి అగ్నిమాపక శాఖ అధికారులు వాహనంతో వచ్చి మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. అయినా సాధ్యం కాదని తేలడంతో జిల్లాలోని గోదావరిఖని, మంథని అగ్నిమాపక కేంద్రాల నుంచి వాహనాలు రప్పించారు. జిల్లాకు చెందిన ఇల్లందుల కృష్ణమూర్తి కొద్దిరోజులుగా టపాసుల దుకాణం నిర్వహిస్తున్నాడు. 20 రోజుల నుంచి గోదాంను మూసివేసి ఉంచారు. ఇంతలో ఏమైందో తెలియదుగానీ ఓ షెట్టర్ నుంచి మంటలు రేగాయి. గమనించిన స్థానికులు యజమానికి సమాచారం ఇచ్చారు. ఆయన ఘటన స్థలానికి చేరుకుని ఫైరింజన్ స్టేషన్‌కు తెలిపారు.

తరలివచ్చిన ప్రజలు..

ఎస్సారార్ ఫైర్ వర్క్స్‌లో అగ్నిప్రమాదం సంభవించిందనే సమాచారం సోషల్ మీడియాలో వ్యాపించడంతో అప్పన్నపేట, అందుగులపల్లితోపాటు పెద్దపల్లి నుంచి పెద్దసంఖ్యలో జనం సంఘటనా స్థలాని చేరుకున్నారు. ఒకింతభయం.. ఘటన ఎలా జరిగిందో తెలుసుకునే పనిలో పడ్డారు.

రూ.కోటికిపైగా ఆస్తినష్టం

అప్పన్నపేట శివారులోని గోదాంలో నిల్వ ఉంచిన టపాసులు అగ్నిప్రమాదానికి గురికావడంతో దాదాపు రూ.కోటికి పైగా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. దసరా, దీపావళి సందర్భంగా టపాసుల అమ్మకాలు సాగడంతో నిల్వలు తగ్గడం వల్లే ఆస్తి నష్టం పెద్దగా జరగలేదని సమాచారం. సంఘటనా స్థలాన్ని ఏసీపీ సారంగపాణి, సీఐ ప్రదీప్, ఎస్సైలు శ్రీనివాస్, రాజేశ్ సందర్శించి ప్రజలను అదుపు చేశారు.

నేడు కార్పొరేషన్ మేయర్ అనిల్‌కుమార్‌తో 'ఫోన్‌ఇన్'



కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో 'సాక్షి' గురువారం 'ఫోన్‌ఇన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కార్పొరేషన్‌లో విస్తరిస్తున్న ప్రధాన రహదారులు, సుందరరూపం సంతరించుకుంటున్న కూడళ్లు, పచ్చదనంతో అలరిస్తున్న పార్కులతోపాటు.. ఇంకా డివిజన్లలో కొన్ని సమస్యలు వేధిస్తూనే ఉన్నాయి. ఈ సమస్యలను మేయర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశం 'సాక్షి' కల్పిస్తోంది. నగర అభివృద్ధికి సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చేవారు ఫోన్‌ఇన్ ద్వారా మాట్లాడవచ్చు.

తేదీ: 12.01.2023
సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 వరకు
సెల్ నంబర్: 9849737100

'కళాశాల కాంప్లెక్స్'కు మంచిరోజులు

- సుల్తానాబాద్‌లో భారీగా పెరిగిన 74 గదుల అద్దె
- కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్లు
- విక్రయించినవారి అగ్రిమెంట్ రద్దు



సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంప్లెక్స్

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంప్లెక్స్ గదుల అద్దె భారీగా పెంచారు. నాలుగు మండలాలకు ముఖ్య కూడలైన సుల్తానాబాద్‌లో అత్యధికంగా షట్టర్లు ఉన్న కాంప్లెక్స్ ఇదే. సుల్తానాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారడంతో అద్దె పెంచాలని అధికారులు నిర్ణయించారు. 2018లోనే వ్యాపారుల గడువు పూర్తి కావడంతో ఓపెన్ టెండర్ వేయాలని పలువురు విన్నవించారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు స్థానిక అధికారులు సైతం సిఫార్సు చేశారు. దీంతో వ్యాపారులందరూ కోర్టు ఆశ్రయించడంతో దాదాపు మూడేళ్ల కాలం వృథాగా పోయి, ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. ఈ క్రమంలో అధికారులు, వ్యాపారులు సయోధ్యతో ముందుకు రావడంతో అద్దె పెంపునకు అంగీకారం కుదిరింది. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, వ్యాపారులు ఇటీవల సమావేశం నిర్వహించి, దీనికి ఆమోదం తెలిపారు. వారసులకు, కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు విక్రయించినవారికి అగ్రిమెంట్ రద్దు చేస్తూ తీర్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధీనంలో ఉన్న 74 షట్టర్లను గతంలో గంపగుత్తగా నెలకు రూ.58 వేలకే అద్దెకు ఇచ్చారు. ఇప్పుడు ఒక్కోదానికి రూ.4 వేల నెలవారీ కిరాయి నిర్ణయించగా ఈ ఏడాది నుంచే అమల్లోకి రానుంది.

1993లో అగ్రిమెంట్..

సుల్తానాబాద్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ నుంచి జూనియర్ కళాశాల మీదుగా శ్రీరాంపూర్ క్రాస్ రోడ్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆనుకొని 74 షట్టర్లు నిర్మించారు. 1993లో వీటిని దక్కించుకున్న వారు అగ్రిమెంట్ చేసుకున్నారు. వీరిలో 20 మందికి పైగా వాటిని విక్రయించారు. మారిన నిబంధనల ప్రకారం వారి అగ్రిమెంట్‌ను రద్దు చేయడమే కాకుండా కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. వారసులు ఏడుగురు ఉన్నారని, వారు సరైన పత్రాలను ఇప్పటివరకు సమర్పించలేదని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

డిపాజిట్లు ఇలా..

కళాశాల కాంప్లెక్స్‌లో వారసులకు గతంలో ఉన్న డిపాజిట్ రూ.30 వేలు కాగా ప్రస్తుతం రూ.1.20 లక్షలు జమ చేయాల్సి ఉంటుంది. కొనుగోలు చేసినవారు రూ.3.70 లక్షలు, పాత డిపాజిట్ రూ.30 వేలు కలుపుకొని రూ.4 లక్షలు జమ చేయాలి. ఈ మొత్తంలో రూ.2 లక్షలు రిఫండ్ కాగా మిగతావి కావని అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు 53 మందికి రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఇకనుంచి కళాశాలకు నెలకు రూ.2.92 లక్షల ఆదాయం రానుంది.

ఓపెన్ టెండర్ వేస్తే బాగుండేదన్న అభిప్రాయం

జూనియర్ కళాశాల కాంప్లెక్స్ గదులకు ఓపెన్ టెండర్ వేస్తే అధిక ఆదాయం వచ్చేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. బహిరంగ మార్కెట్లో షట్టర్ల కిరాయి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఉండగా రూ.4 వేలు నిర్ణయించడం సబబుగా లేదని అంటున్నారు.

మధ్యలోకి దళారులు..

వారసులు, కొనుగోలుదారులు, విక్రయదారులకు మధ్యలో దళారులు రంగప్రవేశం చేసినట్లు వ్యాపారులు చెబుతున్నారు. అధికారులు తమకు అనుకూలంగా ఉన్నారని చెబుతూ రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

దళారుల మాటలు నమ్మొద్దు



ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు కొత్త నిబంధనల ప్రకారం షట్టర్లు కొనుగోలు చేసిన వారికి, వారసులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. ఇప్పటివరకు 53 మందికి రిజిస్ట్రేషన్ చేశాం. దళారుల మాటలను ఎవరూ నమ్మొద్దు.

– శ్రీధర్‌రావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, సుల్తానాబాద్

వ్యాపారులకు ఉపయోగకరం



30 ఏళ్ల అగ్రిమెంటు పూర్తవడంతో అధికారులు, వ్యాపారులం సమావేశమై, నిర్ణయం తీసుకున్నాం. వారసులను గుర్తించేందుకు ఫ్యామిలీ మెంబర్‌తోపాటు నోటరీ తీసుకువచ్చి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెబుతున్నారు. ఇది వ్యాపారులకు ఉపయోగకరం.

– దొడ్ల సత్యం, వ్యాపారి, సుల్తానాబాద్

కార్మిక రత్న జాతీయ అవార్డుకు ఎంపిక


ఆహ్వాన పత్రం అందుకుంటున్న మధునయ్య

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కార్మిక రత్న జాతీయ అవార్డు–2023కు సింగరేణి మైన్స్ అండ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ హెచ్‌ఎంఎస్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము మధునయ్య ఎంపికైనట్లు అవార్డు కమిటీ నేషనల్ చైర్మన్, బీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఆయన ఆహ్వాన పత్రం అందజేశారు. రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బహుజన సాహిత్య అకాడమీ వారు ఏటా ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 12న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో మధునయ్యకు అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ఎం గౌతమ్, రాష్ట్ర కో–ఆర్డినేటర్ విష్ణు, అవార్డు సెలక్షన్ కమిటీ సభ్యులు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. మధునయ్యను హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, సంఘం నాయకులు అభినందించారు.

క్లుప్తంగా

గోదావరి నదిలో దూకిన మహిళ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి గోదావరి బ్రిడ్జి పైనుంచి బుధవారం ఓ మహిళ నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. టూటౌన్, రివర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన మహిళ బుధవారం గోదావరి బ్రిడ్జి వద్దకు వెళ్లింది. రివర్ పోలీసులు గమనించి, దగ్గరకు వెళ్లగా ఆమె కొంత దూరం పరిగెత్తి, నదిలో దూకింది. పోలీసులు ఆమెను కాపాడి, ఒడ్డుకు చేర్చారు. బాధితురాలికి స్వల్ప గాయాలవడంతో 108 వాహనంలో గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఆమె ఆత్మహత్యాయత్నానికి ఓ డాక్టర్ కారణమని సమాచారం.

ఇల్లు కూల్చివేత



యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ పోస్టాఫీస్ ఏరియాలోని ఓ ఇంటిని బుధవారం సింగరేణి ఎస్టేట్ విభాగం అధికారులు కూల్చివేశారు. రాఘవరెడ్డి అనే రేషన్ డీలర్ సింగరేణి అనుమతి లేకుండా రేకుల షెడ్డు నిర్మించారన్న సమాచారం మేరకు అధికారులు పోలీసుల సమక్షంలో కూల్చివేశారు. రాఘవరెడ్డి మాట్లాడుతూ తాను పాత ఇంటి స్థానంలోనే కొత్త గోడలతో ఇంటిని నిర్మించుకుంటున్నానని, సింగరేణికి నెలనెలా బిల్లు చెల్లిస్తున్నానని పేర్కొన్నారు. కూల్చిన ఇంటికి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

మన ఊరు – మన బడి పనులు పూర్తి చేయాలి

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని విఠల్‌నగర్‌లోని అప్పర్ ప్రైమరీ పాఠశాలను బుధవారం కలెక్టర్ సంగీత సందర్శించారు. జిల్లాలో ఎంపిక చేసిన మోడల్ పాఠశాలలో మన ఊరు మన బడి పెండింగ్ పనులు వేగవంతం చేసి సంక్రాంతి నాటికి ప్రారంభించేలా సిద్ధం చేయాలని సూచించారు.

సీఎస్‌ను కలిసిన ఉద్యోగ సంఘ నేతలు


శాంతికుమారితో జిల్లా అధికారులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన శాంతికుమారిని తహసీల్దార్ల సంఘం జిల్లా అధ్యక్షులు రవీందర్, పలువురు టీఎన్‌జీఓల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తక్కల రాములు (58) బుధవారం సిరిసిల్లలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రెండు రోజుల క్రితం బైక్ ప్రమాదానికి గురై చికిత్సపొందుతూ కన్నుమూశాడు. రాములు మృతికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్(టోని) సంతాపం తెలిపారు.

పారిశుధ్య కార్మికుల వేతనాల్లో కోత

- రామగుండం బల్దియా కార్యాలయం ఎదుట నాయకులు, కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని పారిశుధ్య విభాగం కార్మికుల వేతనాల్లో అధికారులు కోత విధించారు. దీంతో ఆందోళన చెందిన కార్మికులు బుధవారం పలు కార్మిక సంఘాల నాయకులతో కలిసి, బల్దియా కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బయోమెట్రిక్ విధానంతోనే వేతనాల్లో కోత సమస్య ఏర్పడిందని, వెంటనే ఆ పద్ధతిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, వై.యాకయ్య మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా 90 శాతం మంది కార్మికుల వేతనాల్లో కోత విధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజు అనే కార్మికుడు 26 రోజులు పని చేస్తే రూ.11 వేలు, మధుకు రూ.7 వేలు, శివకు రూ.7 వేల చొప్పున కోత విధించారని తెలిపారు. శారదకు అసలు జీతమే ఇవ్వలేదని మండిపడ్డారు. ఇలా 90 శాతం మంది కార్మికుల వేతనాల్లో రూ.2 వేల నుంచి రూ.11 వేల వరకు కోత పెట్టారన్నారు. పారిశుధ్య కార్మికుల పొట్ట కొట్టవద్దని, వారిని శ్రమదోపిడీకి, ఆర్థిక దోపిడీకి గురిచేయవద్దన్నారు. పూర్తిస్థాయి వేతనాలు చెల్లించకుంటే గురువారం ఉదయం నుంచి మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావును వివరణ కోరగా ఎక్కడా తప్పిదం జరగలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేస్తున్నామని అన్నారు. కార్మికులు క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు.

గోదావరి వంతెనపై ఫెన్సింగ్ ఏర్పాటు చేయండి

సీపీఐ నాయకుల డిమాండ్



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరి వంతెనపై ఫెన్సింగ్ ఏర్పాటు చేయకుండా రామగుండం నగర పాలక సంస్థ నిర్లక్ష్యం చేస్తోందని, దీంతో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని సీపీఐ నాయకులు ఆరోపించారు. బుధవారం గోదావరిఖని గంగానగర్‌లోని గోదావరి వంతెనపై నిరసన తెలిపారు. నగరపాలిక పాలకవర్గం, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజు, సహాయ కార్యదర్శి మద్దెల దినేశ్ మాట్లాడారు. ఐదేళ్లుగా గోదావరి నది నిండుకుండలా ప్రవహిస్తోందన్నారు. ఈ క్రమంలో కొందరు కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాలతో క్షణికావేశంలో నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలను నివారించడానికి వంతెనపై ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక ప్రాంతంలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ తదితర పరిశ్రమలు ఉన్నప్పటికీ ఫెన్సింగ్ ఏర్పాటుకు ముందుకు రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు గౌతమ్ గోవర్ధన్, తలపల్లి మల్లయ్య, మాటేటి శంకర్, టి.రమేశ్‌కుమార్, ఎర్రల రాజయ్య, మార్కాపురి సూర్య, హర్ష, గౌస్, కనకయ్య, మల్లేశ్, జగన్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను వేధించడం సరికాదు

- ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి మేరుగు రాజయ్య


మాట్లాడుతున్న రాజయ్య

గోదావరిఖని(రామగుండం): కాంట్రాక్టు కార్మికులకు ఎంవీటీసీ అధికారులు లంచాల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి మేర్గు రాజయ్య ఆరోపించారు. అతితక్కువ వేతనాలున్న వారిని వేధించడం సరికాదన్నారు. బుధవారం గోదావరిఖనిలో ఆయన మాట్లాడారు. బొగ్గు గనుల వృత్తి శిక్షణ కేంద్రాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు 21 రోజుల శిక్షణనిచ్చిన అనంతరం మూడు రోజులు ఆన్ ది జాబ్(ఫీడ్ బ్యాక్) ట్రైనింగ్ ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. ఒక్కొక్కరి నుంచి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. వృత్తి శిక్షణ కేంద్రాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనంతో కూడిన శిక్షణనివ్వాలని డిమాండ్ చేశారు. చట్టపరంగా అన్ని ఆర్థిక ప్రయోజనాలను కల్పించాలన్నారు.

కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

- ఫిబ్రవరి 15లోగా దరఖాస్తు చేసుకోవాలి
- సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు


సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు

కరీంనగర్: కార్మికుల పిల్లలు ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు సూచించారు. బుధవారం తన చాంబర్‌లో ఉపకార వేతనాల వివరాలను వెల్లడించారు. 2021–22 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారు ఫిబ్రవరి 15లోపు పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ చదివే వారికి రూ.1,000, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.1,500, ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ (అగ్రికల్చర్, వెటర్నరీ, నర్సింగ్), బీఎస్సీ (హార్టికల్చర్), బీసీఏ, ఎంసీఏ, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీబీఏ, ఎంబీఏ, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్, పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్ విద్యార్థులకు రూ.2,000 అందజేస్తారని తెలిపారు. మే డే నాటికి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 94925 55245 నంబర్‌లో లేదా సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు హర్షిత ఎంపిక


మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతులమీదుగా జ్ఞాపిక అందుకుంటున్న హర్షిత

పెద్దపల్లిరూరల్: జిల్లాకు చెందిన విద్యార్థులు నిర్మల్‌లో జరిగిన ఇన్‌స్పైర్ మనక్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారని డీఈవో మాధవి తెలిపారు. చందనాపూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని దాసరి హర్షిత వరుసగా రెండోసారి జాతీయ స్థాయికి ఎంపికైందని పేర్కొన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నుంచి జ్ఞాపికను అందుకుంది. జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, గైడ్‌టీచర్లు హరిప్రసాద్, శివకృష్ణ, శ్రీనివాస్, శ్యామల తదితరులున్నారు.



కమనీయం శ్రీగోదారంగనాయకస్వామి కల్యాణం

జ్యోతినగర్/పెద్దపల్లి రూరల్: శ్రీగోదారంగనాయకస్వామి కల్యాణాన్ని కృష్ణానగర్‌లోని రాధేకృష్ణదేవాలయం, పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైభవంగా జరిపించారు. జగన్నాథాచార్యులు, రామాచార్యులు స్వామివారిని అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లి శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా చేశారు.



శ్రీవేంకటేశుని ఆలయంలో కుడార్తె ఉత్సవం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని అమర్‌నగర్ ప్రాంతంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కుడార్తె ఉత్సవం జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహాచార్యులు, శ్రీరంగం విజయభాస్కరాచార్యులు, సంపత్‌కుమారాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పాశ్రానుసందానం, పాయసగిన్నెలను భక్తులకు అందించారు. గురువారం ఆలయంలో సుదర్శన హవనం నిర్వహిస్తున్నట్లు అర్చకులు నర్సింహాచార్యులు తెలిపారు.

సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలి


ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

రామగిరి(మంథని): సింగరేణిలో పని చేస్తున్న బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి బుధవారం ధర్నా చేపట్టారు. బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను సింగరేణి యాజమాన్యం దోచుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒప్పందం మేరకు సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా సెమీస్కిల్డ్ వేతనాలివ్వడంతోపాటు ఉచితంగా ఐఎంఈ, పీఎంఈ, చట్టబద్ధ హక్కులు అమలు చేయాలన్నారు. లేకపోతే సింగరేణి వ్యాప్తంగా బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులందరూ సమ్మెకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తోకల రమేశ్, ఉపాధ్యక్షుడు బి.అశోక్, నాయకులు సుద్దాల మనోజ్ పాల్గొన్నారు.

చందనాపూర్ ఎస్సీ కాలనీ ఖాళీ చేయించండి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న జీఎం నారాయణ

గోదావరిఖని(రామగుండం): జీడీకే–11 గని భూగర్భ గనుల పురోగతి, బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా చూడాలని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ సంగీత సత్యనారాయణను కలిశారు. చందనాపూర్ ఎస్సీ కాలనీని ఖాళీ చేయించాలన్నారు. సుందిళ్ల భూముల విషయాన్ని ఆమెతో ప్రస్తావించారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహమూర్తి, సింగరేణి ఎస్టేట్స్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, ఇన్‌చార్జి సెక్యూరిటీ అధికారి ఆంజనేయ ప్రసాద్, సర్వే అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.